ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 17 జూలై 2025




డిప్లొమాలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో ఒకేషనల్ కోర్సును పూర్తిచేసిన వారికి డిప్లొమ రెండో సంవత్సరంలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం) ప్రిన్సిపాల్ కె.నారాయణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసిన విద్యార్థులకు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 19న స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తామన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 24లోగా ఆయా పాలిటెక్నిక్ కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని అన్నారు.

రక్షకా.. మారవా?

- కొంతమంది సిబ్బందిపై అవినీతి ఆరోపణలు
- మద్యం దుకాణాలు, క్వారీల నుంచి వసూళ్లు
- కుటుంబ వ్యవహారాల్లోనూ తలదూర్చుతున్న వైనం
- వారిపై వేటు వేస్తున్నా మారని తీరు



శ్రీకాకుళం, జూలై 16 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో కొందరు పోలీసులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ జేబులు నింపుకుంటున్నారు. మద్యం దుకాణాలు, బార్‌లు, క్వారీల నుంచి నెలవారీ వసూళ్లకు పాల్పడుతున్నారు. రౌడీ షీటర్లతో కూడా లింకులు పెట్టుకొని బెదిరింపులకు దిగుతున్నారు. సివిల్ వ్యవహారాల్లో సైతం తలదూర్చుతున్నారు. పంచాయితీలు చేసి భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాకు కూడా సహకరిస్తున్నారు. ఎవరైనా ముడుపులు ఇవ్వకపోయినా, ప్రశ్నించినా కేసులు పెడతామంటూ భయపెడుతున్నారు. ఆదాయ మార్గాలపైనే దృష్టి సారించి సంపాదనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి వారివల్ల పోలీసు శాఖకు మచ్చ ఏర్పడుతోంది. ఎస్పీ మహేశ్వరరెడ్డి సొంతంగా నిఘా వ్యవస్థ ఏర్పరచి అవినీతి పోలీసుల సమాచారం తెప్పించుకుంటూ వారిపై వేటువేస్తున్నారు. అయినా వారి తీరు మారడం లేదు. ఎస్పీ కంట పడకుండా జాగ్రత్తగా అక్రమాలకు పాల్పడుతున్నారు.

కొన్ని ఉదాహరణలు..

● ఎచ్చెర్ల మండలంలో పాలిటెక్నిక్ చదువుకున్న ఓ యువకుడు తెలివిగా దొంగతనాలు చేసేవాడు. ఇళ్లల్లో చొరబడి డబ్బు, బంగారాన్ని కొద్ది మొత్తంలోనే దోచుకునేవాడు. అంటే ఆ ఇంటిలో ఎన్ని తులాల బంగారు ఆభరణాలు ఉన్నా అందులో తులం లేదా రెండు తులాలనే చోరీ చేసేవాడు. దీనివల్ల ఆభరణాలు కనిపించకపోయినా.. అది ఇంటి దొంగల పని అని.. భర్తపై భార్యకు.. భార్యపై భర్తకు లేదా ఇతర కుటుంబ సభ్యులపై అనుమానం కలిగేలా చోరీలకు పాల్పడుతూ తన వరకు సేఫ్‌గా ఉండేవాడు. ఇలాంటి దొంగతనాలు ఎచ్చెర్ల నియోజకవర్గంతో పాటు పక్క జిల్లాలోనూ చేశాడు. ఈ విషయం పోలీసులకు తెలిసింది. కొద్దిరోజుల కిందట ఆ యువకుడ్ని పట్టుకుని తమదైన విచారణ చేపట్టి భారీమొత్తంలో బంగారాన్ని రికవరీ చేసినట్టు తెలిసింది. అయితే, రికవరీ కొద్దిగానే చూపించి మిగతా బంగా రాన్ని మూడు వాటాలు వేసుకుని పోలీసులు పంచుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొందరి పైఅధికారులకు కూడా వాటా ఇచ్చినట్లు సమాచారం. దీనిపై అంతర్గత విచారణకు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

● ఇచ్ఛాపురం నియోజకవర్గం ఒడిశా రాష్ట్రానికి సరిహద్దుగా ఉంది. ఇక్కడ గతంలో పెద్దఎత్తున అక్రమాలు జరిగేవి. ఇక్కడ పోస్టింగ్ కోసం పోలీసులు పోటీ పడేవారు. సిఫారసులు చేసుకుని మరీ గతంలో ఇక్కడకు వచ్చేవారు. అయితే, అక్రమాల వ్యవహారం ఎస్పీకి తెలియడంతో ప్రక్షాళన చేసేశారు. అయినా ఓ ఎస్ఐ మాత్రం తన తీరు మార్చుకోలేదు. తాను ఏడాది కాలంలో అందుకునే వేతనాన్ని ఒక్క నెలలోనే తీసుకోవాలన్న అత్యాశకు పోయి ఎస్పీ దృష్టిలో పడిపోయారు. ఆ ఎస్ఐ అక్రమాలు తెలుసుకుని వెంటనే అక్కడ నుంచి వీఆర్‌కు పంపేశారు.

● కొన్ని నెలల కిందట గార సబ్ ఇన్‌స్పెక్టర్ వ్యవహారం ఉన్నతాధికారుల వరకూ వెళ్లింది. దీంతో విచారణ నిర్వహించి అక్కడ నుంచి (మిగతా 6వ పేజీలో..)

మద్యం దుకాణాల నుంచి ముడుపులు

మద్యం దుకాణాల నుంచి పోలీసు స్టేషన్లకు ముడుపులు అందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మండలాల్లోని ఒక్కొక్క మద్యం దుకాణం నుంచి రూ.20వేలు, పట్టణాల్లో ఉన్న షాపుల నుంచి రూ.30 నుంచి రూ.40 వేలు, శ్రీకాకుళం నగరంలో బార్‌ల నుంచి రూ.50వేలు ఇలా నెలవారీగా పోలీసు స్టేషన్లకు మామూళ్లు చేరుతున్నట్లు సమాచారం. శ్రీకాకుళం నగరంలో కొన్ని బార్‌ల వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించకుండా ఉండేందుకు స్టేషన్‌కు రూ.50వేలు పైబడి ముట్టజెప్పుతున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇక బెల్ట్ దుకాణాలు ఉంటే.. వాటికి అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.



ఇదో రకం దందా

- జీడి పిక్కల విక్రయాల్లో దళారుల మోసం
- ఒక గ్రామానికి చెందిన పిక్కలు మరో గ్రామానివిగా చెప్పి అమ్మకం
- వ్యాపారులను బోల్తాకొట్టిస్తున్న వైనం



వజ్రపుకొత్తూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జీడిపిక్కల దళారులు తమ ఆదాయాన్ని పెంచుకునేందుకు కొత్త దందాకు తెరలేపారు. చెట్టుపేరు చెప్పుకొని కాయలు అమ్ముకుంటున్న చందాన వ్యవహరిస్తున్నారు. ఒక గ్రామానికి చెందిన జీడి పిక్కలను, మరో గ్రామానికి చెందిన పిక్కలుగా నమ్మబలికి జీడి వ్యాపారులకు అంటగట్టి సొమ్ము చేసుకుంటున్నారు. అక్కుపల్లి, గుణుపల్లి, చీపురుపల్లి, మెట్టూరు పంచాయతీల పరిధిలోని నేలలు సారవంతంగా ఉంటాయి. ఈ భూముల్లో పండే జీడిపిక్కలకు మంచి డిమాండ్ ఉంటుంది. మిగిలిన గ్రామాల్లో పండే పంట కంటే ఈ గ్రామాల్లోని జీడి పంట బాగుంటుందని, కిలో జీడిపప్పు అధికంగా దిగుబడి వస్తుందని వ్యాపారుల నమ్మకం. అందుకే ఈ గ్రామాల పిక్కలను అధిక ధరకు కొనుగోలు చేస్తుంటారు. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు దళారులు మోసాలకు పాల్పడుతున్నారు. ఎక్కడెక్కడో కొనుగోలు చేసిన పిక్కలను పైన చెప్పిన గ్రామాల పిక్కలుగా నమ్మించి వ్యాపారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ పిక్కల నుంచి ఆశించిన స్థాయిలో పప్పు దిగుబడి రాకపోవడంతో వ్యాపారులు నష్టపోతున్నారు. దళారులు చేస్తున్న మోసాన్ని వారు గుర్తించి అక్కుపల్లి, గుణుపల్లి, చీపురుపల్లి, మెట్టూరు తదితర గ్రామాల పెద్దలకు వివరించారు. ఇదే కొనసాగితే మీ గ్రామాల్లో పండించే పిక్కలకు కూడా డిమాండ్ పడిపోతుందని స్పష్టం చేశారు. దీంతో ఆయా గ్రామాల పెద్దలు అప్రమత్తమై దళారులను పిలిచి మాట్లాడారు. లాభాల కోసం దొంగ వ్యాపారాలు చేయడం తగదని, మరోసారి ఇలా చేస్తే అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

డబ్బులు వచ్చాయి.. వెనక్కి వెళ్లాయి

- పంపిణీ కాని కొత్త వితంతు పింఛన్లు
- రెండు నెలలుగా ఇదే పరిస్థితి
- జిల్లాకు 3,824 మంజూరు





● టెక్కలి మండలం కిట్టలాపాడు గ్రామానికి చెందిన మోద లక్ష్మీనారాయణ కిడ్నీ వ్యాధితో ఏడాది కిందట మృతి చెందాడు. ఆయన భార్యకు కూటమి ప్రభుత్వం వితంతు పింఛన్ మంజూరు చేసింది. గత నెలలో పింఛన్ సొమ్ము అందించాల్సి ఉన్నా ఇవ్వకపోవడంతో ఆమె ఆందోళన చెందుతోంది.

● టెక్కలి మండలం నర్సింగపల్లి గ్రామానికి చెందిన దారపు జోగారావు మృతి చెంది ఏడాది దాటింది. ఆయన భార్య ప్రేమకు ఇటీవల వితంతు పింఛన్ మంజూరైంది. ఈ నెల డబ్బులు వచ్చినప్పటికీ ఆమెకు ఇవ్వలేదు. కారణం ఏమిటో తెలియదుగాని పింఛన్ సొమ్మును తిరిగి ప్రభుత్వానికి కార్యదర్శి జమచేశారు.

● మెళియాపుట్టి మండలం జలగలింగుపురం గ్రామానికి చెందిన కొంచడ దండాశి మృతి చెంది ఏడాది దాటింది. గతంలో దండాశికి పింఛన్ వచ్చేది. అతని మృతితో ఆ పింఛన్‌ను భార్య అప్పలమ్మకు ఇవ్వాల్సి ఉంది. కానీ, ఆమెకు ఇంతవరకు పింఛన్ అందలేదు.

టెక్కలిరూరల్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో మొదటి మూడేళ్లు మాత్రమే కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. తరువాత రెండేళ్లు వాటిని ఇవ్వలేదు. అయితే, ఆ రెండేళ్లలో కొత్త పింఛన్ల కోసం అధిక దరఖాస్తులు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వృద్ధులు, వితంతువుల పింఛన్ మొత్తాన్ని ఒకేసారి రూ.వెయ్యి పెంచి రూ.4వేలు చేశారు. అలాగే, 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్య కాలంలో మృతి చెందిన పింఛన్‌దారులకు సంబంధించి వారి జీవిత భాగస్వాములకు కొత్త పింఛన్ మంజూరు చేస్తామని ప్రకటించింది. ఈ ఏడాది మే నెలాఖరుకు అర్హుల జాబితాను ప్రకటించి, జూన్ 12 నుంచి పంపిణీ చేస్తామని చెప్పింది. కానీ, జూలై పూర్తవుతున్నా ఇంకా కొత్త పింఛన్లు (మిగతా 6వ పేజీలో..)

ఏపీ ఈసెట్ తుది విడత కౌన్సెలింగ్
షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల, జూలై 16(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ పూర్తిచేసిన విద్యార్థులు బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ ఈసెట్-2015 తుది విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం) ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం సమన్వయకర్త కె.నారాయణరావు తెలిపారు. తొలి విడతలో సీటు పొందిన విద్యార్థులు కళాశాల మారాలనుకుంటే వెబ్ ఆప్షన్లను ఇచ్చుకోవచ్చన్నారు. అలాగే తొలి విడత కౌన్సెలింగ్‌కు హాజరుకాని వారు కూడా ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తిచేసుకోవాలన్నారు. ఈ నెల 18, 19 తేదీల్లో ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి, సర్టిఫికెట్లు పరిశీలన పూర్తిచేయాలన్నారు. 18 నుంచి 20వ తేదీలోగా వెబ్ ఆప్షన్లను నమోదుచేసుకోవాలని, 21న ఆప్షన్లను మార్చుకోవాలని అన్నారు. ఈ నెల 22న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. 23 నుంచి 25వ తేదీలోగా సీటు పొందిన కళాశాలలో రిపోర్ట్ చేయాలని అన్నారు.

పాలిసెట్ తుది విడత కౌన్సెలింగ్..

పాలిసెట్ -2025 ప్రవేశాలకు తుది విడత కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైనట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(శ్రీకాకుళం), సహాయ కేంద్రం సమన్వయకర్త కె.నారాయణరావు తెలిపారు. తొలి విడత కౌన్సెలింగ్‌కు హాజరై సీటు పొందిన విద్యార్థులు తిరిగి బ్రాంచ్, కళాశాల మారాలనుకున్నవారు ఆప్షన్లను ఇచ్చుకోవచ్చన్నారు. ఇప్పటి వరకు కౌన్సెలింగ్‌కు హాజరుకాని విద్యార్థులు ఈ నెల 17 నుంచి 19లోగా ప్రాసెసింగ్ ఫీజును చెల్లించాలన్నారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీలోగా సహాయ కేంద్రంలో సర్టిఫికెట్ల పరిశీలన పూర్తిచేసుకుని, కళాశాలలు, బ్రాంచ్‌ల ఎంపికకు ఆప్షన్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 21న సీట్లు కేటాయిస్తారని, 24 నుంచి 26వ తేదీలోగా ఆయా కళాశాలల్లో రిపోర్ట్ చేయాలని తెలిపారు.

కార్గో ఎయిర్‌పోర్టుకు అడ్డుతగలొద్దు

- నిర్మాణం పూర్తయితే పలాస అభివృద్ధి చెందుతుంది
- భూముల విలువ పెరుగుతుంది
- పిల్లలకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి
- ప్రజాభిప్రాయ సేకరణలో ఎమ్మెల్యే గౌతు శిరీష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస,జూలై16(ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆలోచన విధానం మేరకే పలాస నియోజకవర్గంలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మించదలపెట్టాం. దీనికి ఎవరూ అడ్డుతగలొద్దు.' అని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక టీడీపీ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, మందస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన రైతులతో ప్రజాభిప్రాయసేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ.. కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. 'శ్రీకాకుళం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారు. అందులో భాగంగా పోర్టులు, ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నిర్వాసిత ప్రాంతాల్లో ఉన్న పిల్లలకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. భూముల (మిగతా 6వ పేజీలో..)

పేదరికం నిర్మూలనే లక్ష్యంగా పీ-4

- జిల్లాలో 75,566 బంగారు కుటుంబాలు
- ఆగస్టు 15 నాటికి దత్తత పూర్తి కావాలి
- రేపటి నుంచి గ్రామ సభలు
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళంకలెక్టరేట్,జూలై 16(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పీ-4 కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా జిల్లాలో చేపట్టిన ఈ కార్యక్రమంపై కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సదస్సు నిర్వహించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం కన్సల్టెంట్ బి.బలరాం బంగారు కుటుంబాల ఎంపిక, దత్తత విధానాలపై అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పీ-4 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 75,566 బంగారు కుటుంబాలను ఎంపిక చేసినట్టు చెప్పారు. ఇందులో కేవలం 9,494 కుటుంబాలు మాత్రమే దత్తతకు ఎంపికయ్యాయని అన్నారు. పలాస, జి.సిగడాంలో దత్తత శాతం చాలా తక్కువగా ఉందన్నారు. ఆగస్టు 15 నాటికి దత్తత ప్రక్రియ పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. డేటా ఎంట్రీలో తప్పులు ఉండరాదని, కొన్ని మండలాల్లో మార్గదర్శకుల గుర్తింపు ఆలస్యం అవుతోందని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల 18 నుంచి గ్రామ, వార్డు సభలు నిర్వహించి 25లోగా తుది జాబితా తయారు చేయాలని ఆదేశించారు. బంగారు కుటుంబాలను ఆర్థికంగా, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల పరంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. రూట్స్ యాప్ ద్వారా ప్రజల నుంచి వివరాలను సేకరించాలని సూచించారు. ఈ సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, టెక్కలి ఆర్డీవో కృష్ణ మూర్తి, నియోజకవర్గ, మండల ప్రత్యేకాధికారులు, ప్రణాళిక విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్స్ ఆడి అప్పులపాలై..

- గులుమూరులో ఒకరి ఆత్మహత్య



మృతి చెందిన బుజ్జి

హిరమండలం, జూలై16 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ డబ్బులు పోగొట్టుకొని అప్పులపాలైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గులుమూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఎండీ యాసిన్ వివరాల మేరకు.. గులుమూరుకు చెందిన మజ్జి బుజ్జి (40) అనే వ్యక్తి హిరమండలంలోని ఓ వాటర్ ప్లాంట్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. బుజ్జి గత కొంత కాలంగా ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడుతున్నాడు. దీనికోసం పలుచోట్ల అప్పులు చేశాడు. ఇందులో భారీమొత్తంలో డబ్బులు పోగొట్టుకున్నాడు. దీంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై మంగళవారం గడ్డి మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. బుజ్జికి భార్య భాగ్యలక్ష్మి, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

మధ్యవర్తిత్వమే ఉత్తమ మార్గం

- న్యాయవ్యవస్థపై భారం తగ్గింపులో కీలకపాత్ర
- జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

6 లో

అ'విశ్రాంత' ఉపాధ్యాయుడు

- ఉద్యోగ విరమణ చేసినా అదే పాఠశాలలో బోధన
- అక్కడే చదువుకుని..
- ఆదర్శంగా నిలుస్తున్న వెంకటనారాయణ

6 లో

చదువులకు ప్రభుత్వ సాయం

- సంఘాల్లోని మహిళల పిల్లలకు ప్రయోజనం
- త్వరలో 'ఎన్టీఆర్ విద్యా సంకల్పం'

6 లో



చదువులకు ప్రభుత్వ సాయం

- సంఘాల్లోని మహిళల పిల్లలకు ప్రయోజనం
- త్వరలో 'ఎన్టీఆర్ విద్యా సంకల్పం'



సమావేశంలో పాల్గొన్న బొంతలవీధి సంఘ సభ్యులు

నరసన్నపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి)

మహిళా సంఘాల సభ్యుల పిల్లల చదువుల కు భరోసానిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకానికి రూపకల్పన చేసింది. ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకంలో భాగంగా స్త్రీనిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ ద్వారా రుణం మంజూరు చేయాలని నిర్ణయించింది. అందుకు సంబంధించిన విధి విధానాలను ఇప్పటికే సిద్ధం చేసింది. ఎన్టీఆర్ విద్యా సంకల్పం పథకాన్ని సీఎం చంద్రబాబు నాయుడు త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న పథకం ద్వారా మహిళా సంఘాల సభ్యుల పిల్లల చదువుకు చేదోడు లభించనుంది. విద్యా వికాసానికి దోహదపడేందుకు 35పైసల వడ్డీతో స్త్రీనిధి రుణాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకానికి ఎన్టీఆర్ విద్యా సంకల్పంగా నామకరణం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకం ద్వారా ఏడాదికి రూ.200 కోట్లు ఖర్చు చేసే విధంగా విధి విధానాలను రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా 30 మండల సమాఖ్యలు, 48,778 స్వయంసహాయక సంఘాలు, 1,296 గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. వీటిలో 4,76,143 మంది సభ్యులు ఉన్నారు. ఈ ఏడాది ఈపథకం ద్వారా జిల్లాలో రూ.20 కోట్ల రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించారు. తద్వారా రెండువేల మందికిపైగా మహిళల పిల్లలకు లబ్ధి చేకూరనుంది.

పథకం వర్తించేదిలా...

ఎన్టీఆర్ విద్యాసంకల్పం పథకం ద్వారా పొందిన రుణాలను 35 పైసల వడ్డీతో రెండు నుండి మూడు సంవత్సరాల వ్యవధిలో తిరిగి చెల్లించేలా వెసులుబాటు కల్పించారు. ఒకటో తరగతి నుంచి పీజీ వరకు ఇతర కోర్సులు చదివే సంఘాల సభ్యుల పిల్లలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకూ ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. ఈ రుణాలను పూర్తిగా పిల్లల చదువుల కోసం వినియోగించాల్సి ఉంటుంది. ఫీజులు, పుస్తకాలు, యూనిఫాం, సాంకేతిక విద్యాసామగ్రి వంటివి కొనుగోలుకు రుణాన్ని ఖర్చు చేయాలన్న నిబంధన విధించారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు సైకిళ్లను కూడా కొనుగోలు చేసుకోవచ్చు. పిల్లలు చదువుల కోసం ఖర్చు పెట్టిన వివరాలకు సంబంధించిన రశీదులను స్త్రీనిధి అధికారులకు అందించాల్సి ఉంటుంది. పిల్లల అవసరానికి అనుగుణంగా రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకూ స్త్రీనిధి రుణాలు అందించాలని నిర్ణయించారు.

పేద కుటుంబాలకు ఊరట..



స్త్రీనిధి పథకం ద్వారా పిల్లల చదువుకు రూ.లక్ష వరకు రుణం పొందే అవకాశం కల్పించాలని సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయించడం సంతోషంగా ఉంది. పిల్లల చదువు కోసం ఈ కొత్త పథకం ఉపయోగం పడుతుంది. తల్లికి వందనంతో పాటు ఈ పథకం ద్వారా మంచి కళాశాలల్లో చదివించేందుకు దోహదపడుతుంది. 35 పైసల వడ్డీకే రూ.లక్ష వరకు రుణం ఇవ్వాలని సీఎం నిర్ణయం తీసుకోవడం పేద విద్యార్థులకు వరం.

-అనుపోజు అరుణకుమారి, బొంతల వీధి, నరసన్నపేట

ఉన్నత చదువులకు అవకాశం..



ఎన్టీఆర్ విద్యా సంకల్పం ద్వారా పిల్లల చదువుకు రుణాలిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బాగుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళా సంఘాల సభ్యుల పిల్లల అభ్యున్నతికి ఈ పథక దోహదం చేస్తుంది. ఉన్నత చదువులు చదివించాలనే తల్లులకు బాసటగా నిలుస్తుంది.

-పుచ్చల కల్పన, మండల మహిళ సమాఖ్య అధ్యక్షులు, నరసన్నపేట

పేద విద్యార్థులకు ఉపయోగం..

ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యకు చేయూతనిచ్చేందుకు ఎన్టీఆర్ విద్యాసంకల్పం పథకానికి శ్రీకారం చుట్టింది. గతంలో స్త్రీనిధి ద్వారా మహిళా సంఘాల సభ్యులకు రుణాలు ఇచ్చేవారు. ఈసారి ఆ తరహా రుణాలతో పాటు పిల్లల చదువు కోసం ప్రత్యేకంగా రుణ సదుపాయం కల్పించాలని సీఎం చంద్రబాబునాయుడు నిర్ణయించారు. అవసరానికి అనుగుణంగా రూ.10వేల నుంచి రూ.లక్ష వరకూ స్త్రీనిధి ద్వారా రుణాలు అందించాలని నిర్ణయించారు. ఉన్నత చదువులకు ఈ పథకం ఉపయోగ పడుతుంది.

-ఎన్.కిరణ్ కుమార్, పీడీ, డీఆర్‌డీఏ, శ్రీకాకుళం

మధ్యవర్తిత్వమే ఉత్తమ మార్గం

- న్యాయవ్యవస్థపై భారం తగ్గింపులో కీలకపాత్ర
- జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా



ర్యాలీలో జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా తదితరులు

శ్రీకాకుళం లీగల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కక్షిదారుల సమస్యల పరిష్కారానికి మధ్యవర్తిత్వమే ఉత్తమమైన మార్గమని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లాన్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ న్యాయవ్యవస్థపై భారం తగ్గించడంలో మధ్యవర్తిత్వం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. జిల్లా కోర్టు నుంచి డే అండ్ నైట్ కూడలి వరకు సాగిన ఈ ర్యాలీలో ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు, న్యాయవిద్యార్థులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. మధ్యవర్తిత్వంపై ప్రజలకు అవగాహన కల్పించేలా నినాదాలు చేశారు.

అసోసియేషన్ హాలులో..

జిల్లాబార్ అసోసియేషన్ హాలులో బుధవారం 'మధ్యవర్తిత్వం-దేశం కోసం' కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఒకటో అదనపు జిల్లా న్యాయాధికారి పి.భాస్కరరావు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం పూర్తిగా స్వచ్ఛంద ప్రక్రియని అన్నారు. న్యాయస్థానాల జోక్యం లేకుండా కక్షిదారులు ఒప్పందం చేసుకోవచ్చన్నారు. మధ్యవర్తులు సూచనలతో షరతులు రూపొందించి, రాజీ చేసుకోవచ్చని తెలిపారు. ఈ సదస్సులో మూడో అదనపు జిల్లా న్యాయాధికారి వివేకానంద శ్రీనివాస్, నాలుగో అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.ఎం.ఫణికుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.హరిబాబు, స్టేట్‌బార్ కౌన్సిల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తంగి శివప్రసాద్, పిట్టా దామోదర్, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



ఐదో తరగతి విద్యార్థులకు గణితం బోధిస్తున్న బీవీ నారాయణ

అ'విశ్రాంత' ఉపాధ్యాయుడు



- ఉద్యోగ విరమణ చేసినా అదే పాఠశాలలో బోధన
- అక్కడే చదువుకుని.. ● ఆదర్శంగా నిలుస్తున్న వెంకటనారాయణ

గార జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆ ఉపాధ్యాయుడికి బోధన అంటే ఎంతో ఇష్టం.. విద్యార్థులకు బోధనతోనే తనకు సంతృప్తి అని చెప్పడమే కాకుండా ఆచరిస్తూ పది మందికీ ఆదర్శంగా నిలుస్తు న్నారు.. తాను చదువుకున్న పాఠశాలలో ఉద్యోగ విరమణ చేసి అక్కడే తిరిగి విద్యా'సేవ' చేస్తున్నారు బీవీ నారాయణ.. కళింగపట్నం పంచాయతీ పెద్దపల్లిపేటకు చెందిన బొడ్డు వెంకట నారాయణ సుమారు 33 సంవత్సరాల పాటు ఉపాధ్యాయుడిగా పని చేసి గత ఏడాది ఉద్యోగ విరమణ చేశారు. పెద్దపల్లిపేట ప్రాథమిక పాఠశాలలో రిటైర్ అయిన తరువాత కూడా అదే పాఠశాలలో గణితం, ఇంగ్లీష్ సబ్జెక్టులను బోధిస్తూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు బోధన చేస్తుండడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాల మోడల్ పాఠశాలగా మార్పు చేయడం వల్ల ఇప్పుడు ఇక్కడ నలుగురు ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. తాను చదువుకున్న పాఠశాలలోనే ఉద్యోగ విరమణ చేయడం, అక్కడే విద్యాబోధన చేసి మరింత మందిని ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న ఆకాంక్షతో చదువు చెబుతున్నానని, ఇది తనకు ఎంతో ఆనందాన్ని స్తోందని బీవీ నారాయణ తెలిపారు.

ఇతర టీచర్లకు ఆదర్శం..

బీవీ నారాయణ అదే పాఠశాలలో చదివి, అక్కడే ఉద్యోగ విరమణ చేశారు. ఆ తరువాత కూడా అక్కడే తిరిగి విద్యార్థులకు ఉచితంగా బోధిస్తున్నారు. ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

-నక్క రామకృష్ణ, ఎంఈవో, గార

రక్షకా.. మారవా?

(ఐదో పేజీ తరువాయి)

ఎస్‌ఐను వీఆర్‌కు పంపేశారు.

- ఓ రౌడీషీటర్‌తో శ్రీకాకుళం రూరల్ పోలీసులకు ఉన్న లింకులు, వారి మధ్య జరిగిన సంభాషణ ఆడియో ఇటీవల బయటపడింది. ఇది పోలీసులకు తలనొప్పి తెచ్చిపెట్టింది. ఈ వ్యవహారంలో కానిస్టేబుల్‌పై వేటు పడింది. ఎస్‌ఐపై విచారణ జరుగుతోంది.
- జి.సిగడాంలో విగ్రహాల ధ్వంసం కేసులోనే కాకుండా.. ఇతర విషయాల్లో కూడా నిర్లక్ష్యంగా ఉన్నారన్న కారణంతో అక్కడి ఎస్‌హెచ్‌వోను ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపేశారు.
- టెక్కలి నియోజకవర్గంలో ఓ ఎస్‌ఐ టీడీపీకి చెందిన ఓ ద్వితీయ స్థాయి నాయకుడి కుటుంబ వ్యవహారాల్లో తలదూర్చారు. కేసు నమోదు విషయంలో ఆ నాయకుడి నుంచి భారీగా నగదు డిమాండ్ చేసినట్లు ఎస్‌ఐపై ఆరోపణలు వెల్లువెత్తాయి.
- జిల్లా సరిహద్దు నుంచి ఇసుక దాటవేసే విషయంలో ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చురుగ్గా వ్యవహరిస్తున్నారని విశ్వసనీయ సమాచారం. సివిల్ వ్యవహారాల్లో కూడా తెలివిగా తలదూర్చి.. అందులోనూ పెత్తనం చూపిస్తున్నారు కొందరు పోలీసులు. బాధితుల తరఫున కంటే కేసుల్లో స్థాయి.. వాటి విలువ ఆధారి తంగా కొన్ని స్టేషన్లలో ముడుపులకే ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
- పలాస నియోజకవర్గంలో ఓ మండలానికి చెందిన ముగ్గురు యువకులు మద్యం తాగి పోలీసులకు పట్టుబడ్డారు. వారిపై కేసు లేకుండా చేసేందుకు ఓ ఎస్‌ఐ డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎస్‌ఐ అడిగినంత ఇచ్చి ఆ యువకులు కేసు నుంచి బయటపడ్డారు. ఇటువంటి ఘటనలు కొన్ని మాత్రమే వెలుగులోకి వచ్చి సంబంధిత పోలీసులపై వేటు పడుతుంది. ఇంకా చాలా వ్యవహారాల్లో పోలీసులు తల దూర్చి డబ్బులు వసూలు చేస్తున్నా అవి బయటపడడం లేదు. ఇప్పటికైనా పోలీసులు తీరు మారుకొని అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండి శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడాలని ప్రజలు కోరుతున్నారు.

డబ్బులు వచ్చాయి.. వెనక్కి వెళ్లాయి

(ఐదో పేజీ తరువాయి)

మంజూరు కాకపోవడంతో వితంతువులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలో కొత్తగా స్పౌజ్ పింఛన్లు 3,824 మంజూరయ్యాయి. వీటికి సంబంధించి సుమారు రూ.1.52 కోట్లు నిధులు వచ్చాయి. గత నెల 12న పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించారు. ఏమైందో గానీ డబ్బులు పంపిణీ చేయకుండా తిరిగి ప్రభుత్వానికి జమచేశారు. ఈ నెలలో పంపిణీ చేసేందుకు మళ్లీ రూ.1.52కోట్లు మంజూరయ్యాయి. కానీ, ఈ నెల కూడా వితంతువులకు నిరాశే ఎదురైంది. వచ్చిన డబ్బులను కార్యదర్శులు తిరిగి ప్రభుత్వ ఖాతాకు జమచేశారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని తమ భాగస్వామ్య పార్టీలతో కలిసి అట్టహాసంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం భావించింది. అయితే, వివిధ కారణాలతో అది సాధ్యపడడం లేదు. మరోపక్క టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో బిజీగా ఉన్నారు. దీంతో కొత్త పింఛన్ల పంపిణీలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

ఆదేశాలు రావాలి..

కొత్తపింఛన్లు ఇవ్వడానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. అందుకే రెండు నెలల సొమ్ము వచ్చినా తిరిగి ప్రభుత్వానికి జమ చేశాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే పంపిణీ చేస్తాం

-ప్రసాద్‌పండా, ఎంపీడీవో, మెళియాపుట్టి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు, విద్యార్థులు

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.పవిత్ర, డి.చందు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటర్ ఫలితాలు వచ్చి మూడు నెలలవుతున్నా నేటికీ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించలేదన్నారు. ఎన్నికల సమయంలో ప్రస్తుత మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు డిగ్రీలో డబల్ మేజర్ విధానాన్ని అమలు చేయాలని, పేదలను పీజీ విద్యకు దూరం చేసే జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను పెంచాలని కోరారు. విద్యార్థుల ఫీజు రీ-యింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం సహాయ కార్యదర్శి గణేష్, ఉపాధ్యక్షుడు సీహెచ్‌రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్గో ఎయిర్‌పోర్టుకు అడ్డు తగలొద్దు

(ఐదో పేజీ తరువాయి)

విలువ కూడా పెరుగుతుంది. కొంతమంది పనికట్టుకొని ఎయిర్‌పోర్టుపై దుష్ప్రచారం చేస్తున్నారు. వైసీపీకి చెందిన ఓ నేత అయితే మరో ప్రాంతంలో నిర్మించాలని కోరుతున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమ కూడా తీసుకురాలేదు. కేవలం ప్రజలు, ప్రతిపక్ష నాయకులను హింసించడం తప్పా మరే కార్యక్రమాలు చేయలేకపోయారు. అటువంటి నాయకులు ఎయిర్‌పోర్టు వద్దని నీతులు చెబుతుండడం వారి విజ్ఞతకే విడిచిపెడుతున్నాం. మూర్ఖులు మాట్లాడినంతమాత్రాన ఎయిర్‌పోర్టు నిర్మాణం ఆగిపోదు.' అని అన్నారు. ఆర్డీవో జి.వెంకటేష్ మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టుకు మొత్తం 1200 ఎకరాల భూమి సేకరిస్తున్నామని తెలిపారు. ఇందులో 200 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉండగా, మిగతా వెయ్యి ఎకరాలు సేకరిస్తున్నామని అన్నారు. గ్రామలకు ఇబ్బందులు లేకుండా భూసేకరణ చేపడుతున్నామన్నారు. మెట్టూరు, అనకాపల్లి, చీపురుపల్లి గ్రామాల్లో ఎక్కువ శాతం భూమి సేకరిస్తున్నామన్నారు. ఎయిర్‌పోర్టుకు సంబంధించి మూడు విడతలుగా భూపరీక్షలు చేయాల్సి ఉందని, 25 కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి కొండలు, విద్యుత్‌లైన్లు లేకుండా సర్వే చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల తహసీల్దార్లు టి.కళ్యాణచక్రవర్తి, జి.సీతారామయ్య, ఎం.శ్రీకాంత్, సీఐ తిరుపతిరావు, ఎస్ఐ కె.కృష్ణప్రసాద్, నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదిరి, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సహకారం అందించాలి..

ఎయిర్‌పోర్టును నిర్మిస్తే ఈ ప్రాంతం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుంది. దీన్ని ఆపాలని ప్రయత్నించడం తగదు. అభివృద్ధికి విరోధం కలిగించకుండా అంతా సహకారం అందించాలి.

-పాలవలస వైకుంఠరావు, బీజేపీ జిల్లా కార్యదర్శి

భయాందోళన తొలగించాలి..

ఎయిర్‌పోర్టుపై ప్రజల్లో నెలకొన్న భయాందోళనలు తొలగించాలి. రైతులకు అడంగళ్ పత్రాలు రావడం లేదు. దీనివల్ల నష్టపరిహారం రాదనే ఆందోళన ఉంది. దీన్ని నివృత్తి చేసి రైతులకు స్పష్టమైన హామీ ఇవ్వాలి. ఎన్ని ఎకరాల్లో ఎయిర్‌పోర్టు నిర్మిస్తారో చెప్పాలి. ఇక్కడ భూములు లేనివారే ఎక్కువగా ఆందోళన చేస్తున్నారు.

-ఉమాపతి, రామ్‌పురం

ఐదేళ్లూ పట్టించుకోలేదు..

వైసీపీ ఐదేళ్ల పాలనలో పలాస అభివృద్ధిని పట్టించుకోలేదు. ప్రస్తుతం అభివృద్ధి కోసం ఎయిర్‌పోర్టు వస్తుంటే దాన్ని అడ్డుకుంటున్నారు. ప్రజలు గుర్తించాలి. రైతులను భయాందోళనకు గురిచేస్తున్న వారిని నిరోధించాలి.

-సూరాడ మోహనరావు, అక్కుపల్లి

శతాధిక వృద్ధుడు మృతి



నర్సిమప్పడు (ఫైల్)

కోటబొమ్మాళి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జర్జంగి పంచాయతీ గుంజిలోవ గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు కవిటి నర్సిమప్పడు (108) బుధవారం తన స్వగృహంలో కన్నుమూశారు. ఆయన 1917లో జన్మించారు. స్వాతంత్ర్య పోరాట ఘట్టాలను వివరించే వారని స్థానికులు చెబుతున్నారు. కొన్నేళ్ల కిందట స్థానిక పంచాయతీ ఉప సర్పంచ్‌గా పని చేశారు. ఆయనకు భార్య నారాయణమ్మ (95), ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



టెక్కలిలో గల జిల్లా కేంద్ర ఆసుపత్రి

వైద్యుల కొరతతో రోగులకు వెతలు

- ఇదీ జిల్లా కేంద్ర ఆస్పత్రి పరిస్థితి

టెక్కలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రిని వైద్యులు, వైద్య సిబ్బంది కొరత వేధిస్తోంది. చాలీచాలని సిబ్బందితోనే వైద్యసేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది. దీని వల్ల రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఆంధ్రా, ఒడిశాలోని వివిధ ప్రాంతాల నుంచి రోజుకు సుమారు 600 మంది ఔట్‌పేషెంట్లు జిల్లా కేంద్ర ఆసుపత్రికి వస్తుంటారు. పేరుకు 200 పడకల ఆసుపత్రి అయినా అందుకు సరిపడా వార్డులు లేవు. దీంతో ఇరుకిరుకుగా 150 వరకు బెడ్స్‌ను ఏర్పాటు చేశారు. సుమారుగా 140 మంది ఇన్‌పేషెంట్లు సేవలు పొందుతున్నారు. ఈ ఆసుపత్రిలో 40 మంది వరకు స్టాఫ్‌నర్సులు ఉండాల్సి ఉండగా 17 ఖాళీలు ఉన్నాయి. కొందరు వైద్యులు విధుల్లో చేరి ఉన్నత చదువులు పేరిట జారుకున్నారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్, ఎనస్తీషియా వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. డెర్మటాలజీ వైద్యుని పోస్టు ఖాళీగా ఉంది. అలాగే రేడియాలజీ, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్, డిప్యూటీ సివిల్ సర్జన్ మొత్తంగా 7 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటికి తోడు డార్క్‌రూమ్ అసిస్టెంట్ పోస్టులు రెండు ఖాళీగా ఉన్నాయి. అన్ని పోస్టులు కలిపి 32 ఖాళీలు ఉన్నాయి. దీంతో ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది కొరత అంశంపై సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యారావు వద్ద ప్రస్తావించగా ఖాళీల విషయమై జిల్లా ప్రాంతీయ ఆసుపత్రుల సమన్వయ అధికారి దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు.

పందులకు నిలయంగా వంశధార క్వార్టర్లు

- పట్టించుకోని అధికారులు

నరసన్నపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణం శివారు ప్రాంతంలో గల వంశధార క్వార్టర్లు పందుల పెంపక కేంద్రాలుగా మారిపోయాయి. క్వార్టర్ల లోని 15 ఇళ్లు శిథిలమైపోయాయి. వాటిని కొంతమంది గొర్రెలు, పందుల పెంపక కేంద్రాలుగా మార్చేశారు. దీంతో వందలాది పందులు పట్టణంలో స్వైరవిహారం చేస్తున్నాయి. వంశధార ఈఈ కార్యాలయం వెనుకభాగం పందులకు నిలయంగా మారినా.. పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కుమ్మరివీధి, మండల పరిషత్ కార్యాలయం ఆవరణ, పాతబస్టాండ్, జమ్ముజంక్షన్ తదితర ప్రాంతాల్లో వీటి బెడద ఎక్కువగా ఉంటోంది. పందుల కారణంగా పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయని... అనారోగ్యం పాలవుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పందుల పెంపకం దారులకు నోటీసులు జారీ చేశామని ఈవో దాక్షాయణి చెబుతున్నారు. కానీ పరిస్థితిలో మార్పు లేకపోవడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు.



ఎమ్పీడీవో కార్యాలయ ఆవరణలో ఇలా..

మధ్యవర్తిత్వంపై అవగాహన



టెక్కలి: బైక్ ర్యాలీలో పాల్గొన్న సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.నిర్మల, న్యాయవాదులు

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 'మధ్యవర్తిత్వం-దేశం కోసం' అవగాహన ర్యాలీలు, మానవహారాలను బుధవారం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా 90 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు న్యాయాధికారులు తెలిపారు. జిల్లాలో జరిగిన ర్యాలీలు ఇలా..

-ఆంధ్రజ్యోతి బృందం



సోంపేట: ర్యాలీ నిర్వహిస్తున్న సీనియర్, జూనియర్ న్యాయాధికారులు జె.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, న్యాయవాదులు



ఇచ్ఛాపురం: ర్యాలీలో పాల్గొన్న న్యాయాధికారి పి.షరీఫ్‌కుమార్, న్యాయవాదులు


పొందూరు: ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయాధికారి బి.జ్యోత్స్న, సిబ్బంది


ఆమదాలవలస: ర్యాలీలో పాల్గొన్న న్యాయాధికారి బి.రమ్య తదితరులు


కొత్తూరు: ర్యాలీలో పాల్గొన్న న్యాయాధికారి రాణి, న్యాయవాదులు


పాతపట్నం: అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి రోషిణి

విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు

శ్రీకాకుళం క్రైం, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దని ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట సుధాకర్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం నగరంలోని డేఅండ్ నైట్ కూడలిలో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తున్న ఆటోలను నిలుపుదల చేసి ఆరు ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ పక్క సీట్‌లో, ఆటో వెనుకభాగంలో విద్యార్థులను ఎక్కించడం వల్ల ప్రమాదం జరిగితే విద్యార్థుల బంగారు భవిష్యత్తు నాశనమవు తుందని తెలిపారు. నిబంధనలు పాటించని డ్రైవర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఐజేనాయుడు కాలనీలో కార్డన్ సెర్చ్

ఆమదాలవలస, జూలై 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐజే నాయుడు కాలనీలో బుధవారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ సీపాన కాంతారావు ఆధ్వర్యంలో కాలనీలో ద్విచక్ర వాహనాలను పరిశీలించి ఎటువంటి ధ్రువపత్రాలు లేని వాహనాలు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. గంజాయి, మాదక ద్రవ్యాలు, పేకాట స్థావరాలపై ముమ్మర తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

మహిళా సంఘాలకు రుణాలివ్వాలి

సోంపేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాలకు ఇచ్చే వార్షిక రుణాలు ఎటువంటి అడ్డంకులు లేకుండా త్వరితగతిన అందించాలని వెలుగు పీడీ పి.కిరణ్‌కుమార్ కోరారు. వెలుగు కార్యాలయంలో సోంపేట, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల బ్యాంకు మేనేజర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం పి.శ్రీనివాసరావు, డీపీఎంలు బి.నారాయణరావు, నాగలక్ష్మి, ఏపీఎంలు ప్రసాదరావు, గోవిందరావు, జాంబవతి, అప్పలనరసమ్మ పాల్గొన్నారు.

28న 'బుద్ధునితో నా ప్రయాణం' నాటక ప్రదర్శన

శ్రీకాకుళం అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణా శాఖ ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారి సమర్పణలో ఈనెల 28న 'బుద్ధునితో నా ప్రయాణం' నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు దళిత బహుజన నేతలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఇల్లీసుపురం అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో పోస్టర్లను ఆవిష్కరించారు. 80 అడుగుల రహదారి లోని బృందావన్ ఫంక్షన్ హాల్‌లో ఈ నాటక ప్రదర్శన ఉంటుందని దళిత ఆదివాసీ బహుజన సంఘాల జేఏసీ నాయకులు కల్లేపల్లి రాంగోపాల్, తైక్వాండో శ్రీను, డాక్టర్ కంఠవేణు, బోయిన మురళీకృష్ణ, యజ్జల గురుమూర్తి తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఏఐజీడీఎస్ యూనియన్‌కు రాజీనామా

పొందూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆల్‌ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘానికి రాజీనామా చేస్తున్నట్లు వి.శశిభూషణరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో కేంద్ర సంఘనాయకుడు మహదేవయ్య తీసుకుంటున్న నిర్ణయాలు, డివిజన్, సర్కిల్ పరిధిలో కార్యవర్గాల ఎంపికలో ఏకపక్ష నిర్ణయాలపై సభ్యులు అసంతృప్తి చెందుతున్నారన్నారు. దీనిని గమనించి శ్రీకాకుళం డివిజన్ కార్యదర్శితో పాటు రీజనల్ ప్రతినిధి (ఆర్ఆర్), రాష్ట్ర సహాయ కార్యదర్శి పదవులకు తాను రాజీ నామా చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో వందలాది సభ్యులతో ఇతర సంఘంలో చేరనున్నానని తెలిపారు.

23 నుంచి మహిళలకు శిక్షణ

ఎచ్చెర్ల, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో కంప్యూటర్ అకౌంటెన్సీలో మహిళలకు ఈనెల 23 నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ ఎస్.రాంజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 38 రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. ఎంఎస్ఆఫీస్, ట్యాలీ, జీఎస్టీపై శిక్షణ ఉంటుందన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 ఏళ్ల లోపు మహిళలు అర్హులన్నారు. వివరాల కోసం 77021 80537, 95534 10809 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు 2003 డీఎస్సీ ఫోరం ఆధ్వర్యంలో నిరసన

ఆమదాలవలస, జూలై 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్న డిమాండ్‌తో శుక్రవారం 2003 డీఎస్సీ ఫోరం ఆధ్వర్యంలో శాంతియుత నిరసన చేపడుతున్నట్లు ఫోరం కన్వీనర్ కొత్తకోట శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయ సమీపంలోని జ్యోతీ బాపూలే పార్క్ వద్ద నిరసన చేపడుతున్నామన్నారు. మెమో 57కు అర్హత పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతంచేయాలని కోరారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీ లక్ష్యం

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీ లక్ష్యంగా బీఎల్వోలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో కె.సాయి ప్రత్యూష అన్నారు. బుధవారం శ్రీకాకుళం నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రం 200 నుంచి 251 వరకు బీఎల్వోలకు శిక్షణ కార్యక్రమం స్థానిక రెవెన్యూ గెస్ట్ హౌస్ సమావేశ మందిరంలో నిర్వహించారు. బీఎల్వోలకు పరీక్ష నిర్వహించి, సర్టిఫికెట్లను అందజేశారు. డిప్యూటీ తహసీల్దార్ జీకే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే గేట్ బంద్: వాహనదారుల ఇబ్బందులు



ఇచ్ఛాపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): రైల్వే ట్రాక్ పనులు నిమిత్తం ఇచ్ఛాపురం రత్తకన్న రోడ్డు ఎల్‌సీ గేట్‌ను బుధవారం రైల్వే అధి కారులు మూసి వేశా రు. దీంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి రైల్వే సిబ్బంది బోర్డుపై సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు గేటు మూతబడుతుందని బోర్డుపై రాసి ప్రదర్శించారు. అటుగా వచ్చే వాహన దారులు దీనిని గమనించి రాకపోకలు నిలిపివేశారు. గేటు మూత విషయం తెలియని వాహన దారులు వచ్చి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. అక్కడికి వచ్చిన వాహనాలు తిరిగి వెళ్లేందుకు ప్రయత్నించడం తో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసు నమోదు

ఇచ్ఛాపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు దుకాణం సీజ్‌చేయటం జరుగుతుందని ఏడీఏ టి.భవానీ శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎరువుల విక్రయ కేంద్రాన్ని తనిఖీచేశారు. ఎరువులు, బిల్లులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించే ధరలకే విక్రయించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తేచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఏవో అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పంటల బీమా నమోదు చేసుకోవాలి

కంచిలి, జూలై 16(ఆంధ్రజ్యోతి): వరి సాగుచేసే రైతులు ఎకరాకు రూ.160 చెల్లించి బీమా చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ భవానీ శంకర్ కోరారు. భొగాబెణి, కత్తివరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల బీమా చేయించుకోవడం వల్ల ప్రకృతి వైపరీత్యాల సమయంలో బీమా వర్తించి నష్టపరి హారం అందుతుందన్నారు. ఎద రైతులు పంటలో నవధాన్యాలు వేయడం వల్ల కలుపు నివారణతో పాటు నేల సారవంతమవుతుందన్నారు. అలాగే పంటకు చీడపీడల బారినుంచి రక్షించుకో వచ్చన్నారు. అనంతరం ఎద సాగు చేస్తున్న రైతులకు నవధాన్యాల కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కొంకేన సురేష్, విశ్వేశ్వరరావు, మండల యాంకర్ టి.శివానందం, పలువురు రైతులు పాల్గొన్నారు.


నవధాన్యాల కిట్లు అందజేస్తున్న వ్యవసాయాధికారులు

నారీశక్తి యాప్‌పై అవగాహన అవసరం

ఇచ్ఛాపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): నారీశక్తి యాప్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే, విప్ బెందాళం అశోక్ అన్నారు. బుధవారం మండపల్లి పంచాయతీలో నారీశక్తి యాప్‌ను ప్రారంభించి, దాని ఆవశ్యకత, ప్రాధాన్యతను వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళల రక్షణకు ప్రభు త్వాలు అనేక చట్టాలు చేస్తున్నాయని, వీటిపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ శ్రీనివాస రావు, టీడీపీ నాయకులు పద్మనాభం, సూర్యనారాయణ, ఢిల్లీరావు, సహ దేవ్‌రెడ్డి, చంద్రశేఖర్, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై అప్రమత్తంగా ఉండాలి

రణస్థలం, జూలై 16(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా ద్వారా మహిళలపై జరుగుతున్న వేధిం పులపై అప్రమ త్తంగా ఉండాలని డీఎస్పీ సీహెచ్ వివేకానంద అన్నారు. లెంకపేట కేజీబీవీ పాఠశాలలో బుధవారం నారీశక్తిపై అవగాహన కలిగించారు. మహిళా భద్రత, మహిళలపై జరుగుతున్న దాడులు, గృహ హింస శక్తి యాప్ ఉపయోగం తదితర అంశాలను వివరించారు. మహిళ సురక్షిత ప్రయాణం కోసం ఆటోలకు సురక్ష క్యూ ఆర్ కోడ్ యాప్ అందుబాటులోకి తెచ్చామన్నారు. కార్యక్రమంలో జేఆర్‌పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

శక్తియాప్‌తో రక్షణ

సోంపేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): శక్తియాప్‌తో విద్యార్థినులకు నిరంతర రక్షణ ఉంటుందని, ప్రతి విద్యార్థి సెల్ ఫోన్‌లో శక్తియాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సీఐ మంగరాజు తెలిపారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కృషి

సరుబుజ్జిలి, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం శక్తియాప్‌పై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా సీఐ పి.సత్యనారాయణ మాట్లాడుతూ.. నేరాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్ఐ బి. హైమావతి మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కార్య క్రమంలో శక్తి టీం ఏఎస్ఐ రమణమూర్తి, మోహన్‌రావు, ఉషారాణి వివిధ అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పైడి పద్మావతి, ఎన్ఎస్ఎస్ పీవో రమేష్‌సాహు తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం: మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

సోషల్ మీడియాకు బానిస కావొద్దు

పొందూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం యువత మాదక ద్రవ్యాలతో పాటు సోషల్ మీడియాకు బానిసై భవిష్యత్తును, జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వీటికి దూరంగా ఉండాలని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నారీశక్తి యాప్‌పై అవగాహన కలిగించారు. ముఖ్యంగా మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా వల్ల మహిళలే ఎక్కువగా బాధితులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ ఇందిర, విద్యార్థినులు పాల్గొన్నారు.

రాష్ట్ర సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: అశోక్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగానే ఏడాది పాలనలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని ఎమ్మెల్యే, విప్ బెందాళం అశోక్ అన్నారు. బుధవారం మండపల్లి పంచాయితీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీచేసి పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు లోపింటి పద్మనాభం, పీఏసీఎస్ అధ్యక్షుడు పెదిని బాబ్జీ, నేతలు మేరుగు సూర్యనారాయణ, దూపాన సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనే ధ్యేయం: శంకర్


ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని శ్రీకా కుళం నగర పరిధిలోని హయా తినగరం 43, 44, 45 వార్డుల్లో బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథ కాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్య క్షుడు మాదారపు వెంకటేష్, నేతలు జామి భీమశంకరరావు, కవ్వాడి సుశీల, కొమర కమల పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

పాత శ్రీకాకుళం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు సేవలందించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బుధవారం ఆయన పరిశ్రమలశాఖ, కాలుష్య నియంత్రణ మండలి, కర్మాగారాల శాఖ, కార్మిక, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు, ఏపీ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్, పశుసంవర్ధక తదితర శాఖల కార్యాలయాలను సందర్శించి ఆయా శాఖల ప్రగతిపై చర్చించారు.

బాలికల హాస్టళ్లకు బెడ్స్ పంపిణీ

ఆమదాలవలస, జూలై 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ, ఎస్సీ బాలికల హాస్టల్‌తో పాటు మహాత్మా జ్యోతీబా పూలే రెసిడెన్షియల్ పాఠశాలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఫోమ్ బెడ్స్‌ను అందించారు. రోటరీ ఇంటర్నేషనల్ పీజీడీ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వ ర్యంలో వీటిని అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీటీ చౌదరి, జె.వెంకటేశ్వరరావు, క్లబ్ ప్రతినిధులు జె.రవిబాబు, కె.సంజీవరావు, బాబులాల్, జె.రామారావు, టి.దీపక్, పాపారావు, రాజు, జనార్దనరాజు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రమణం పూజలు

ఇచ్ఛాపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని అమ్మవార్ల దేవాలయాల్లో కర్కాటక సంక్రమణం పూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామదేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో సింధూర మర్దన, కుంకుమ పూజలు, హోమాలు చేశారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు లయన్స్‌క్లబ్ సభ్యుల అభినందన

శ్రీకాకుళం కలెక్టరేట్, జూలై 16(ఆంధ్రజ్యోతి): 'వన్ నేషన్ వన్ ప్రొడక్ట్' విభాగంలో పలాస జీడిపప్పుకు దేశ స్థాయిలో గుర్తింపు లభించిన నేపథ్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను లయన్స్‌క్లబ్ హర్షవల్లి ప్రతినిధులు అభినందించారు. బుధవారం కలెక్టర్‌కు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ డా.మేడిశెట్టి సత్యస్వరూప్, చందక్ నీహార్ నాయుడు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన 'భానోజి'


సీఎం చంద్రబాబుకు సమస్యలు విన్నవిస్తున్న భానోజినాయుడు

రణస్థలం, జూలై 16(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడును ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పిన్నింటి భానోజి నాయుడు బుధవారం డిల్లీలో కలిశారు. సర్పంచ్‌ల గౌరవ భృతి పెంచాలని, సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలని సీఎంని ఆయన కోరారు.

న్యూస్ బాక్స్

పాఠశాలలను అభివృద్ధి చేయండి

ఆమదాలవలస, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలని డిప్యూటీ డీఈవో ఆర్.విజయకుమారి అన్నారు. బుధవా రం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల సంఖ్యను పెంచాలని, విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాములు, యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనాలి

ఇచ్ఛాపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ వ్యాయామం, క్రీడల్లో పాల్గొనాలని, ఈ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని నియోజకవర్గ స్పోర్ట్స్ ఇన్‌చార్జి కె.పద్మనాభం రెడ్డి, మండల స్పోర్ట్స్ ఆర్గనైజర్ బి.కృష్ణయ్య అన్నారు. బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సెప్టెంబరు ఒకటి నుంచి ఆరవ తేదీ వరకు మండల స్థాయి, 8 నుంచి 15 వరకు డివిజన్, 15 నుంచి 20వ తేదీ వరకు జరిగే జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించనున్నారన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేలా విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వాలని సూచించారు.

గ్యాస్‌ను అధిక ధరలకు విక్రయిస్తే ఏజెన్సీ రద్దు



వినియోగదారులతో మాట్లాడుతున్న డీఎస్‌వో

హిరమండలం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వంటగ్యాస్‌ను వినియోగదారులకు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్‌వో జి.సూర్యప్రకాశ్ నిర్వాహకులను హెచ్చరించారు. అవసరమైతే సంబంధిత గ్యాస్ ఏజెన్సీని రద్దు చేస్తామని స్పష్టం చేశారు. బుధవారం హిరమండలంలోని హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులతో ఆయన మాట్లాడారు. గ్యాస్ సక్రమంగా అందుతుందా లేదా? ఎంత ధరకు విక్రయి స్తున్నారు? బిల్లులు సరిగా ఇస్తున్నారా? లేదా అనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిరమండలం హెచ్‌పీ వంటగ్యాస్ ఏజెన్సీలో అధిక ధరలకు గ్యాస్ విక్రయిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టినట్టు తెలిపారు. గ్యాస్‌ను రూ.879.50కు విక్రయించాల్సి ఉండగా... వినియోగదారుల నుంచి రూ.900 తీసుకుంటున్నారని తన విచారణలో తేలిందన్నారు. బిల్లులు కూడా కొంత మందికి ఇవ్వడం లేదని చెప్పారు. ఈ మేరకు ఏజెన్సీ మేనజర్‌ను పిలిచి హెచ్చరించారు. జిల్లాలో 6,63,659 రేషన్ కార్డులు ఉన్నాయని.. కొత్తవి కావాలని 15వేల దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. ఆయనతో పాటు డీటీలు కె.మధుబాబు, అరుణకుమారి, సత్యనారాయణ, కృష్ణ తదితరులు ఉన్నారు.

గంధపు చెట్టు దొంగిలించారని ఫిర్యాదు



సిరిగంధం చెట్టు మొదలు

శ్రీకాకుళం క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరం బొందిలీపురం తుల్జా భవానీ ఆలయ పరిసర ప్రాంతంలో ఉన్న తన ఇంటి ఆవరణలోని సిరిగంధం చెట్టు దుంగను సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికి దొంగిలించుకపోయారని రాంగోపాల్‌సింగ్ బుధవారం శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మే 27న కూడా ఒక సిరిగంధం చెట్టును నరికి దొంగిలించారని, అప్పుడు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. 25 ఏళ్లుగా పెంచు కుంటున్న సిరిగంధం చెట్టును దొంగిలించుకపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. సదరువ్యక్తులు తన ఇంటి ఐరెన్ గేటుకు ఎలక్ట్రికల్ వైరుతో ముడివేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికైనా రెండో పట్టణ పోలీసులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. అయితే ఇటీవల శ్రీకాకుళం నగరంలోని సూర్య మహల్ కూడలి వద్ద ఉన్న జామియా మసీదులో కూడా మూడు గంధం చెట్లును గుర్తు తెలియని వ్యక్తులు నరికి దొంగలించిన ఘటనపై ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ విషయం నగరంలో సంచలనం కలిగించింది. ఇటువంటి వాటిపై పోలీసులు విచారణ వేగవంతం చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

80 సారా ప్యాకెట్లు స్వాధీనం

కంచిలి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఏఎస్ పల్లి గ్రామంలో సారా విక్ర యిస్తున్న సమాచారం మేరకు సోంపేట ఎక్సైజ్ సీఐ జీవీ రమణ సిబ్బంది తో కలిసి బుధవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా 80 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సారా అమ్ముతున్న మహిళ పారి పోయిందని, ఆమెను పట్టుకుని కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. ఈ సోదాల్లో ఎక్సైజ్ సిబ్బంది మార్కారావు, భానుప్రసాద్, ఉమాపతి పాల్గొన్నారు.

12 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

శ్రీకాకుళం రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలంలోని పెద్దగనగళ్ల వానిపేట, మొపసుబందర్ గ్రామాల్లో బుధవారం సాయంత్రం పేకాట శిబిరాలపై దాడులు నిర్వ హించి 12 మందిని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ కె.రాము తెలిపారు. పెద్దగనగళ్లవాని పేటలో 8 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.7,630 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే మొపసుబందర్‌లో పేకాట ఆడుతున్న నలుగురి నుంచి రూ2,150 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పక్కా సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): హిరమండలం మండలం పిండ్రువాడకు చెందిన సబ్బి కల్యాణి (24) అదృశ్యమైనట్టు ఆమె అక్క కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు టూటౌన్ ఎస్ఐ సంతోష్ బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. కల్యాణి నగరంలోని గుజరాతిపేటలో తన అక్క కుమార్తె భవాని ఇంటి నుంచి ఈనెల 7న పిండ్రువాడకు వెళతానని చెప్పగా భవాని భర్త రాము కల్యాణిని బైక్‌పై శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దించాడు. అయితే స్వగ్రామానికి ఆమె వెళ్లలేదు. ఆచూకి తెలియకపోవడంతో భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మెళియాపుట్టి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గొప్పిలి ఫీడర్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ నరసింహ కుమార్ తెలిపారు. గొప్పిలి, చిన్నాహంస, కరజాడ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నరసన్నపేటలో రేపు..

నరసన్నపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): దేవాది విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. దేవాది, గోపాలపెంట, మాకివలస, కిళ్లాం, రావులవలస, శ్రీరాంపురం గ్రామాలకు సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ నరసింహ కుమార్, ఏఈ బాలకృష్ణ బుధవారం తెలిపారు.

కోటబొమ్మాళిలో..

కోటబొమ్మాళి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి, నిమ్మాడ సబ్ స్టేషన్ల పరిధిలోని వివిధ గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది.

పోలాకిలో...

పోలాకి, జూలై 16(ఆంధ్రజ్యోతి): కిల్లాం, ఈదులవలస, ముప్పిడి, దీర్ఘాశి, సంతలక్ష్మీపురం, గొల్లలవలస, తోటాడ గ్రామాల పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదు.

నందిగాంలో...

నందిగాం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): హర్షబాడ, నౌగాం, కైజోల, సవరరామక్రిష్ణాపురం, సవరలింగుపురం, మలియాలింగుపురం, పెద్దగురువూరు, జమ్మిపేట, మామిడిపల్లి, ముకుందాపురం, సాగరంపేట, గనియాపేట, వెంకటాపురం, మదనాపురం గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.

పాతపట్నంలో...

పాతపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పాతపట్నం టౌన్‌తో పాటు దశరథపురం, తిడ్డిమి, సూర్యనారాయణపురం, రంకిణి, చంగుడి, సరాళి, గోపాలపురం, కొరసవాడ, బూరగాం, బోరుభద్ర, సీతారాంపల్లి, కాగువాడ, గురండిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది.

సారవకోటలో..

జలుమూరు (సారవకోట), జూలై 16 (ఆంధ్రజ్యోతి): అలుదు, కెళ్లవలస, పద్మాపురం, వడ్డినవలస, వెంకటాపురం, కుమ్మరిగుంట, చోడ సముద్రం, సవరడ్డపనస, అంగూరు, బుడితి, నవతల తదితర గ్రామాలకు శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

జలుమూరులో...

జలుమూరు: జోనంకి, గంగాధరపేట, అబ్బాయిపేట, తలతరియా, సుబ్రమణ్యపురం, వెంకటాపురం, కెఎల్ఎన్‌పేట, కొమనాపల్లి, యలమంచిలి, అక్కురాడ, చెన్నాయివలస, అచ్యుతాపురం, నగిరికటకం, శ్రీముఖలింగం, కరకవలస, బైదలాపురం, సురవరం, తిమడాం, పర్లాం, మాకివలస, అంధవరం గ్రామాలకు శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

రణస్థలంలో..

రణస్థలం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జేఆర్‌పురం, రణస్థలం, రావాడ, కొండములగాం కమ్మసిగడాం, వేల్పురాయి, దేవరపల్లి, అర్జునవలస, ఎం.నగరప్పాలేం, బంటుపల్లి, తిరుపతిపాలెం, పున్నానపాలెం, సంచాం తది తర గ్రామాల్లో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఈఈ యోగీశ్వరరావు తెలిపారు.

ఎచ్చెర్లలో...

ఎచ్చెర్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పొన్నాడ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తపేట, వెంకన్నగారిపేట, తెప్పరేవు, సెగిడిపేట, ఎచ్చెర్ల, లింగాలపేట, ట్రిపుల్ ఐటీ, అంబేడ్కర్ నగర్ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

సరుబుజ్జిలిలో...

సరుబుజ్జిలి, జూలై 16(ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి సబ్‌స్టేషన్ రొట్టవలస ఫీడర్ పరిధిలో అలమాజీపేట, చెవాకులపేట, చిగురువలస, వెన్నెలవలస, భానమామిడివలస తదితర గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదు.

అదపాక సబ్ స్టేషన్ పరిధిలో..

లావేరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి):గుర్రాలపాలెం, కొత్తకుంకాం, పాతకుంకాం, పైడాయ వలస, పెదకొత్తపల్లి తదితర గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.

పీఏసీఎస్ ఛైర్మన్‌గా వంకల కూర్మారావు



కూర్మారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పలాస మండలం లొద్దభద్ర గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వంకల కూర్మారావు పీఏసీఎస్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. డైరెక్టర్లుగా బొడ్డపాడుకు చెందిన బొడ్డు దుష్యంత్, బ్రాహ్మణతర్లకు చెందిన సుధాకర్‌లు నియమితులయ్యారు. బుధవారం పలాస తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీష, నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరిలు వారికి సంబంధిత పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్, పలాస మండల అధ్యక్షులు కుత్తుం లక్ష్మణ్, లొడగల కామేశ్వరరావు, ఎం.శ్రీను, గాలి కృష్ణారావు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్‌కు చర్యలు

పలాస, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పలాస -కాశీబుగ్గ మున్సిపాలిటీలో మాస్టర్‌ప్లాన్ అమలుకు చర్యలు తీసుకుంటున్నారు. బుధవారం రాత్రి ఎమ్మెల్యే గౌతు శిరీషతో కమిషనర్ ఎన్.రామారావు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది చర్చించారు. రాబోయే 20 సంవత్సరాల్లో అభివృద్ధి చేయడానికి ఈ ప్లాన్ రూపొందించారు. మున్సిపాలిటీ పరిధిలోని 25 రెవెన్యూ గ్రామాలు, బయట ఉన్న 21 రెవెన్యూ గ్రామాలు కలిపి పారిశ్రామిక, వ్యాపార, నివాస ప్రాంతాలుగా వర్గీకరించారు. జాతీయ రహదారిని కలుపుకుంటూ జోన్లవారీగా విభజించారు. 30, 40, 60, 100 అడుగుల వెడల్పుతో రహదారుల నిర్మాణం ప్రతిపాదనలతో ఈ ప్లాను తయారు చేశారు. దీనికి సంబంధించి గురువారం డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని కమిషనర్ ప్రకటించారు. 30 రోజుల్లోగా ప్రజలు అభ్యంతరాలు తెలియజేయాలని కోరారు.

బియ్యం తరుగు లేకుండా అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో సాయి ప్రత్యూష

జలుమూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రేషను డిపో డీలర్లకు బియ్యం తరుగు లేకుండా అందించాలని శ్రీకాకుళం ఆర్డీవో కె.సాయ ప్రత్యూష ఆదేశించారు. స్థానిక పౌరసరఫరాల గిడ్డంగిని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషను బియ్యం ఏ ఒక్కరికీ అందలేదనే ఫిర్యాదు రాకుండా చూడాలన్నారు. బియ్యం బస్తాలను తూకం వేసి బస్తాకు ఎంతమేరకు తరుగు వస్తుందో పరిశీలించారు. కాటాల పనితీరును పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. బియ్యం పంపిణీలో తరుగుదల వస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఆమెతో పాటు ఆర్.ఐ.కిరణ్, గొడౌన్ ఇన్‌చార్జి కోటేశ్వరరావు ఉన్నారు.

178 మందికి కౌలు హక్కు పత్రాలు

కోటబొమ్మాళి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో 178 మంది కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలు అందజేసినట్టు స్థానిక వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 210 మంది కౌలు రైతులను గుర్తించామని తెలిపారు. భూ యజమానులు, కౌలు రైతులతో గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సదస్సులు నిర్వహించి, అవగాహన కల్పించామని తెలిపారు. యజమానుల అంగీకారంతో 178 మంది కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలు అందజేశామన్నారు. సరైన అవగాహన లేక కొందరు భూ యజమానులు అంగీకార పత్రం ఇచ్చేందుకు విముఖత చూపుతున్నారు. అలాంటి వారికి మరోసారి అవగాహన కల్పించి.. మిగిలిన వారికి త్వరలో పత్రాలు అందజేస్తామని చెప్పారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే



మంత్రి నారా లోకేష్‌తో ఎమ్మెల్యే గోవిందరావు తదితరులు

కొత్తూరు/పాతపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, కొత్తూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఉండవల్లిలోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తూరు మండల అభివృద్ధికి నిధులను అందించాలని విజ్ఞప్తి చేశారు. పీఏసీఎస్ ఛైర్మన్‌గా మాతల గాంధీకి అవకాశం కల్పించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మండల టీడీపీ అధ్యక్షుడు అగతముడి మాధవరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎ.అరుణకుమార్ ఉన్నారు.

పంచాయతీల ఆడిట్ ప్రారంభం



ఆడిట్ నిర్వహిస్తున్న దృశ్యం

నందిగాం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పంచా యతీలకు సంబంధించి 2024-25 సంవత్సరానికి విడుదలైన నిధులు, ఖర్చులపై ఆడిట్ బుధవారం ప్రారంభమైంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ ఆడిటర్లు చిట్టిబాబు, శ్రీనివాసరావుల పర్యవేక్షణలో పంచాయతీలకు విడుదలైన జనరల్‌ఫండ్స్, ఆర్థిక సంఘ నిధులు తదితర నిధులకు సంబంధించి ఆడిట్ నిర్వహించారు. నౌగాం తదితర పంచాయతీలకు సంబంధించి తొలిరోజు రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కె.సంతోష్‌కుమార్, ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పోలాకిలో...

పోలాకి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వివిధ పంచాయతీల ఖర్చులపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా అధికార బృందం ఆడిట్ నిర్వహించింది. ఈఓపీఆర్‌డీ బి.పద్మావతి, సూపరింటెండెంట్ బలగ ప్రకాష్‌లు సంబంధిత రికార్డులను వారికి అప్పగించారు.

పోలీస్‌స్టేషన్ వద్ద మాజీ మంత్రి అప్పలరాజు హల్‌చల్

పలాస, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చిన్నబడాం గ్రామం వద్ద మంగళవారం రాత్రి టీడీపీ-వైసీపీ వర్గీయుల మధ్య జరిగిన గొడవకు సంబంధించి వాటిలో లేని వ్యక్తులు ముగ్గురిని పోలీసులు విచారణ పేరిట తీసుకురావడం అన్యాయమని వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. దీన్ని నిరసిస్తూ కాశీబుగ్గ పోలీసు స్టేషన్ వద్ద బుధవారం మధ్యాహ్నం ఆయన హల్‌చల్ చేశారు. పోలీసు స్టేషన్ బయట బైఠాయించి... నిరసన వ్యక్తం చేశారు. వివరాలివీ...చిన్నబడాం రోడ్డులో కొత్తమ్మతల్లి అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం రాత్రి సంబరాలు జరిగాయి. టీడీపీ నాయకులు అవినాష్, సంతోష్, మౌళితో అదే ప్రాంతంలో ఉన్న కొవ్వూరు సుబ్బారావు వర్గీయుల మధ్య ఘర్షణ జరిగింది. వైసీపీ నాయకులు తమపై దాడి చేశారని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో మొత్తం ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం అప్పలరాజు పోలీసు స్టేషన్‌కు చేరుకొని తమవారిని ఎందుకు విడిచిపెట్టలేదని చిందులు తొక్కారు. టీడీపీ నాయకుల ఫిర్యాదుపై వారిని విచారించేందుకు తీసుకువచ్చామని పోలీసులు తెలిపారు. దీంతో పోలీసులు, అప్పలరాజు మధ్య మాటల యుద్ధం జరిగింది. అనంతరం బైఠాయించి... నిరసన వ్యక్తం చేస్తున్న అప్పలరాజుతో సీఐలు సూర్యనారాయణ, తిరుపతిరావులు మాట్లాడుతూ తమ విధులకు ఆటంకం కలిగించవద్దని కోరారు. దీంతో అప్పలరాజు, ఆయన అనుచరులు వెనుదిరిగారు. ఈ వ్యవహారంపై అప్పలరాజు విలేకరులతో మాట్లాడుతూ చిన్నబడాం సంఘటనపై ఎస్పీ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తమవారు తప్పుచేస్తే కేసులు నమోదు చేసుకోవచ్చని, లేనివారిపై కేసులు నమోదు చేయడం సరికాదన్నారు.

మళ్లీ మున్సిపల్ కార్మికుల సమ్మె



నిరసన తెలుపుతున్న కార్మికులు

కాశీబుగ్గ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గతంలో జరిగిన సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం వీరు సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. ఇప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి శంకర్, ప్రకాష్, ముఖి రమేష్, బాలకృష్ణ, గులాబి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి



ఎస్టీ కమిషన్ చైర్మన్‌తో లక్ష్మీనారాయణ తదితరులు

మెళియాపుట్టి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్టీ కమిషన్ చెర్మన్ డీవీజీ శంకరరావుకు బుధవారం మందసలో గిరిజన సంఘం నాయకులు బైరిశింగి లక్ష్మీనారాయణ వినతిపత్రం ఇచ్చారు. మండలానికి డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కోరారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించాలని కోరారు. గిరిజన గ్రామాలకు రహదారి లేక డోలీ మోతలు తప్పడం లేదని తెలిపారు. ఆయనతో పాటు గిరిజన సంఘ నాయకులు ఎలుగుబంటి దుర్యోధన ఉన్నారు.

నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

టెక్కలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో ఈనెల 17 నుంచి 20 వరకు జరుగనున్న జాతీయ సౌత్‌జోన్ నెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేశారు. విజయవాడలో వీరికి ముందుగా శిక్షణ ఇచ్చి, అనంతరం జాతీయ నెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలకు పంపించనున్నట్టు జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బాడాన నారాయణరావు తెలిపారు. జిల్లా నుంచి పురుషుల విభాగంలో కె.సీతయ్య, వై.యాదగిరి, మహిళల విభాగంలో యు.పావని, కె.జ్యోత్స్న, సీహెచ్.రుక్మిణి, హేమలత ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఈ క్రీడాకారులను వ్యాయామ ఉపాధ్యాయులు రఘునాథరావు, రామిరెడ్డి తదితరులు అభినందించారు.

హైస్కూల్ ప్లస్ పాఠశాలలను పరిరక్షించండి

టెక్కలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): హైస్కూల్ ప్లస్ పాఠశాలలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావు అన్నారు. బుధవారం టెక్కలిలో గల హైస్కూల్ ప్లస్ పాఠశాలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. ఇంటర్ విద్యార్థులకు పాఠాలు బోధించే ఉపాధ్యాయులు అవసరమని అన్నారు. ఖాళీలను భర్తీచేసి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. ఆయనతో పాటు కార్యదర్శి కోదండరామిరెడ్డి, కేవీ రమణ, శ్రీధర్, మోహనరావు పాల్గొన్నారు.

నాగుపాముల కలకలం

పలాస, జూలై 16(ఆంధ్రజ్యోతి):పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు సమీపంలోని ఓ పంట పొలంలో రెండు భారీ నాగుపాములు బుధవారం కలకలం సృష్టించాయి. వీటిని ఈస్ట్రన్‌ఘాట్ వైల్డ్ సొసైటీ సభ్యుడు, స్నేక్‌క్యాచర్ ఓంకార్‌త్యాడి చాకచక్యంగా పట్టుకొని సమీప మెండు అటవీ ప్రాంతంలో సురక్షితంగా విడిచిపెట్టారు. పంట పొలాల్లో నాగుపాములను చూసి రైతులు హడలిపోయారు. బుసలుకొట్టి అక్కడే ఉండిపోవడంతో ఓంకార్‌త్యాడికి సమాచారం అందించారు. అటవీ శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ఆయన వాటిని పట్టుకొన్నారు. అనంతరం జాతీయ రహదారి కోసంగిపురం వద్ద ఉన్న మెండు అటవీ భూమిలో సురక్షితంగా విడిచిపెట్టారు.



పాములను అడవిలో విడిచిపెడుతున్న ఓంకార్‌త్యాడి

ఆక్రమణలను అడ్డుకోరూ..

పాతపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాగువాడ గ్రామంలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న విలువైన స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్నారంటూ గ్రామవాసులు ఎంపీడీవో పి.చంద్రకుమారికి ఫిర్యాదు చేశారు. మాజీ సర్పంచ్ గణపతి రాజారావునాయుడు ఆధ్వర్యంలో ప్రజలు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఈవోపీఆర్‌డీ ఊణ్ణ రామచంద్రరావు క్షేత్రస్థాయిలో పరిశీలించి... ఎటువంటి అనుమతి లేని కారణంగా నిర్మాణాలను నిలుపుదల చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

మురుగునీటి సమస్య పరిష్కరించాలి

కొత్తూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అలికాం-బత్తిలి రహదారిలో మురుగునీటి నిల్వ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘ సభ్యులు డిమండ్ చేశారు. బుధవారం కొత్తూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జిల్లా సంఘ అధ్యక్షులు ఎస్.అప్పన్న, న్యాయవాదుల సంఘ జిల్లా కార్యదర్శి ఎం.అప్పారావు, పైడి రాజు, యతిరాజు, ప్రసాదరాజు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన యువత

పాతపట్నం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చంగుడి గ్రామంలో యువకులు రోడ్డుకు ఇరువైపులా బుధవారం మొక్కలను నాటారు. మొత్తం 75 మొక్కలు నాటినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమేష్ పండి, గౌరీశంకర్ జెన్నా, సుమన్ కుమార్ జెన్నా, ప్రకాశ్ పండి, రంజన్ బరోడా, సింటు బరోడా పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పరిశీలన

జలుమూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలను స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం బుధవారం పరిశీలించింది. అచ్యుతాపురం, జోనంకి పంచాయతీల్లో బుధవారం ఈ బృందం పర్యటించింది. ఈ పరిశీలనలో వీఆర్వో గోపి, కార్యదర్శి సరోజిని తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మనుగడ

నందిగాం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మొక్కలతోనే మనుగడ సాధ్యమని నందిగాం పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు పి.చంద్రశేఖరరావు అన్నారు. బుధవారం నందిగాం ప్రాంతీయ పశువైద్య కేంద్రం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు కె.జయరాం, అభ్యుదయ రైతు పి.రవిబాబు, ఎల్ఎస్‌ఏ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

షిర్డిలో శిక్షణకు ఎంపిక

పలాస, జూలై 16 (ఆంధ్రజ్యోతి): షిర్డి సాయిబాబా సంస్థాన్ ట్రస్టు నిర్వహణ కమిటీ దేశంలో ఉన్న వివిధ బాబా మందిరాల్లో పనిచేస్తున్న అర్చకులకు పూజారి శిక్షణ ఇవ్వడానికి నిర్ణయించింది. ఈ మేరకు పలాస శివాజినగర్‌లో ఉన్న షిర్డి సాయిబాబా సంస్థాన్ ట్రస్టులో పనిచేస్తున్న అర్చకునికి అవకాశం కల్పిస్తున్నట్లు షిరిడి ట్రస్టు వర్తమానం పంపించింది. దీనిపై శివాజినగర్ బాబా మందిరం ట్రస్టు చైర్మన్ దువ్వాడ శ్రీధర్ మాట్లాడుతూ ఇది తమ అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ట్రస్టు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సాగు పద్ధతులు పాటించాలి

టెక్కలి (రూరల్), జూలై 16 (ఆంధ్రజ్యోతి): వరి లో సాగు పద్ధతులను పాటించాలని టెక్కలి వ్యవసాయశాఖ ఏడీ కె.జగన్మోహన్ తెలిపారు. బుధవారం అయోధ్యపురంలో వరి సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, జెండాల తొలగింపు

టెక్కలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతజాతీయ రహదారి డివైడర్లపై వివిధ రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, ఫ్లెక్సీలు, వాణిజ్య ప్రకటనల బోర్డులను బుధవారం పంచాయతీ సిబ్బంది తొలగించారు. వాహన చోదకులు అవస్థలు పడుతున్నారని, అందువలనే తొలగించామని కార్యదర్శి వెంకటశ్రీనివాసరావు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం పనితీరు భేష్

కొత్తూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): బమ్మిడిలో గల అంగన్‌వాడీ కేంద్రం పనితీరు బాగుందని శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంత్రిశ్రీ ప్రశంసించారు. గ్రామంలో కొంతమంది ఫిర్యాదు చేయటంతో లబ్ధిదారులు, సర్పంచ్ వి.అరుణకుమారి సమక్షంలో బుధవారం విచారణ చేపట్టారు. పౌష్టికాహారం సక్రమంగా అందుతోందని, అంగన్‌వాడీ కేంద్రం పనిదినాల్లో తెరిచి ఉంచుతున్నారని వారంతా పీడీకి తెలిపారు. కేంద్రం పరిసరాల పరిశుభ్రత, పాఠశాల ఆవరణలో మంచి వాతావరణం ఉండటంపై పీడీ సంతృప్తి వ్యక్తం చేశారు. పీడీతో పాటు కొత్తూరు ఇన్‌చార్జి సీడీపీవో పప్పల లక్ష్మీబాయి, సూపర్‌వైజర్లు జి.జానకమ్మ, గౌసీబేగమ్ పాల్గొన్నారు.

కాంప్లెక్స్ ఎరువులు వేయండి

నరసన్నపేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): వరి నాట్లు వేసే ముందు దమ్ములో కాంప్లెక్స్ ఎరువులు వేయడం వల్ల భూసారం పెరుగుతుందని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు కె.భాగలక్ష్మి, ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఉర్లాంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితో పాటు ఎంఏవో వై.సూర్యకుమారి, టి.మూర్తి, పి.వెంకటేష్, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు ఇవ్వండి

టెక్కలి, జూలై 16(ఆంధ్రజ్యోతి): తోపుడుబండ్ల కార్మికులకు గుర్తింపు కార్డులు జారీచేయాలని సీఐటీయూ నాయకులు కొల్లి ఎల్లయ్య, నంబూరు షణ్ముఖరావులు కోరారు. బుధవారం టెక్కలిలో తోపుడుబండ్ల కార్మికుల సంఘంతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు చూపి రోడ్డు పక్కన ఉన్న వాటిని తొలగించడం అన్యాయమన్నారు.